సాక్షి
తిరుపతి
శుక్రవారం । 28 । జూలై । 2023



వెంటాడిన మృత్యువు
తిరుపతిలో నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ నిర్మాణ పనుల చివరి అంకంలో అపశ్రుతి చోటుచేసుకుంది.
- 8లో



దేశం మెచ్చేలా తిరుపతి అభివృద్ధి
దేశం మెచ్చేలా తిరుపతిని అభివృద్ధి చేస్తామని డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు.
- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	26
చిత్తూరు	35	25
తిరుమల	30	22
గూడూరు	36	23
నగరి	36	27

న్యూస్‌రీల్

మీ సేవలు అభినందనీయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి చరిత్రలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. గురువారం విజయవాడ తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. అనంతరం తిరుపతి అభివృద్ధిపై కొంత సేపు చర్చించారు. తిరుపతి అభివృద్ధి బాగుందని, గడపగడప, జగనన్న సురక్ష కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారని సీఎం ప్రశంసించారు. తిరుపతిని మహానగరంగా తీర్చిదిద్దేందుకు తమవంతు సహాయసహకారాలు అందిస్తానని సీఎం భరోసా ఇచ్చారు.

నేరాలు తగ్గుముఖం



మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం: గత సంవత్సరంతో పోలిస్తే 2023లో నేరాలు తగ్గుముఖం పట్టాయని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. గురువారం మహిళా విశ్వవిద్యాలయంలో సావేరి కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన 2023 అర్ధ సంవత్సర వార్షిక నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. తిరుపతిలో అసాంఘిక శక్తులకు తావు లేకుండా పనిచేయాలన్నారు. మహిళలు, బాలికల మిస్సింగ్ కేసును సవాలుగా స్వీకరించి పురోగతి సాధించాలన్నారు. పోలీస్ శాఖకు మచ్చ తెచ్చే పనులు తీసుకురావద్దని హెచ్చరించారు.

రౌడీ షీటర్ల కదలికపై నిఘా
రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని డీఐజీ సిబ్బందిని ఆదేశించారు. వారు ముఠాలను ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు.



▸▸ పలమనేరు నియోజకవర్గం, గంగవరం మండలం, మారేడుపల్లికి చెందిన రవికుమార్‌కు మూడు ఎకరాల పొలం ఉంది. మొదటి నుంచి వివిధ రకాల పంటలు సాగుచేశారు. అయినా ఫలితంలేదు. పదేళ్లుగా ఇదే పరిస్థితి. నాలుగు నెలల క్రితం టమాట సాగువైపు మొగ్గు చూపారు. నాటి నెలన్నర నుంచి పంట దిగుబడి చేతికొచ్చింది. అప్పటి నుంచి కిలో రూ.60కిపైగా పలుకుతుండడంతో సంబరపడ్డాడు. ఆపై రేటు అమాంతంగా పెరగడంతో అతని సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. కిలో టమాట రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయించాడు. మొత్తం రూ.48 లక్షల వరకు ఆదాయం వచ్చింది. గతంలో ఎప్పుడూ ఇంత ఆదాయం చూడలేదని, ఇప్పటిదాకా ఉన్న అప్పులు తీర్చేశానని చెబుతున్నాడు.



▸▸ శ్రీకాళహస్తి మండలం, టీఎంవీ కండ్రిగకు చెందిన సుబ్రమణ్యంరెడ్డి గతంలో క్రమంతప్పకుండా వరి సాగుచేసేవారు. తెగుళ్లు, మందులతో విసిగిపోయేవారు. పెట్టుబడి కూడా వచ్చేది కాదు. దిగుబడి వచ్చినా సరైన గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టాలు ఎదుర్కొనేవారు. ప్రతి ఏడాదీ ఇదే పరిస్థితి. మూడు నెలల నుంచి కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఆ వైపు మొగ్గుచూపారు. నెల్లూరు నుంచి బ్రాండెడ్ బెండ గింజలు, గోరుచిక్కుళ్లు, కాకరకాయ గింజలు తెచ్చి 40 సెంట్లలో సాగుచేశారు. నెలకంతా కోతకొచ్చాయి. కిలో రూ.50 లెక్కన హోల్‌సేల్‌గా విక్రయించడం ప్రారంభించారు. చేతినిండా ఆదాయం గడించారు. ప్రస్తుతం బెండ రేటు తగ్గిందని, గోరు చిక్కుళ్లు కిలో రూ.60 వరకు పలుకుతున్నాయని తెలిపారు. వరి, వేరుశనగ, చెరుకు కన్నా కూరగాయల సాగు మేలని, ఎంత కష్టపడితే అంత ఆదాయం పొందవచ్చని అంటున్నారు.

- ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపుతున్న రైతాంగం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెరిగిన సాగువిస్తీర్ణం
- టమాటతో అధిక ఆదాయం
- కూరగాయలతో ఆశించిన ఫలితం
- ఆరోగ్యం దృష్ట్యా పెరిగిన వినియోగం
- కలిసివస్తున్న ప్రభుత్వ రాయితీ

ఉప్పొంగిన ఉద్యానం!

.. ఇలా ఆలోచిస్తోంది రైతులు రవికుమార్, సుబ్రమణ్యంరెడ్డే కాదు.. ప్రతి రైతూ ఆ దిశగానే అడుగులు వేస్తున్నారు. ఉద్యాన పంటల వైపే మొగ్గు చూపుతున్నారు. కొంతకాలంగా కూరగాయల ధరలు నిలకడగా ఉండడంతో ఆశించిన స్థాయిలో ఆదాయం పొందుతున్నారు. సాధారణ పంటలకు స్వస్తి చెప్పి ఉద్యాన పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. కష్టం తక్కువ..ఫలితం ఎక్కువని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 75 శాతం మంది వ్యవసాయాధారంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తమకున్న పొలంలో వరి, వేరుశనగ, చెరుకు, మామిడితోపాటు ఇతర ఉద్యాన పంటలు సాగుచేస్తుంటారు. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో ఎక్కువగా వరి సాగుచేస్తుండగా.. చిత్తూరు జిల్లాలో అధికంగా ఉద్యానపంటలైన టమాట, చెరుకు, ఇతర కూరగాయల పంటలు సాగుచేస్తుంటారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెన్నై, బెంగళూరు నగరాలు సమీపంలోనే ఉండడంతో కూరగాయలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. రైతులు ఆయా ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. ఈ క్రమంలో ప్రతి ఏటా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

ఆహారాన్ని మార్చేసిన కరోనా
కరోనా నుంచి కోలుకున్న తర్వాత ప్రజలు ఆహార అలవాట్లు మార్చుకున్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం కోసం అన్వేషణ ప్రారంభించారు. ఎక్కువ శాతం మంది శాఖాహారాన్నే ఇష్టపడుతున్నారు. వివిధ రకాల కూరగాయాలతో కూడిన భోజనాన్ని తీసుకుంటున్నారు. ఫలితంగా గత రెండేళ్లుగా కూరగాయాల వినియోగం పెరిగింది. మార్కెట్లో కూరగాయాలకు డిమాండ్ ఏర్పడింది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం అంతకంతకూ పెరుగుతోంది. రైతులు ఉన్న పొలంలో కొంత ఉద్యాన పంటల సాగుకు కేటాయిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మామిడి మినహా 23,091 హెక్టార్లలో కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు.

భలే డిమాండ్
నాలుగు నెలల నుంచి కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఏది ఎత్తుకున్నా కిలో రూ.80కి పైనే. గతంలో రైతులు హోల్‌సేల్‌గా మార్కెట్‌కు తరలించేవారు. అయితే ఇటీవల రైతులే వ్యాపారులుగా మారుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వారపు సంతల్లో కూరగాయలు విక్రయిస్తూ అధిక రాబడి పొందుతున్నారు. అప్పులు సైతం తీరిపోయాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడి జిల్లా సమాచారం
సాధారణ సాగు విస్తీర్ణం 1,56 లక్షల హెక్టార్లు

ఆకుకూరల	342
క్యాబేజీ	116
క్యాలీఫ్లవర్	171
పొటాటో	368
క్యాప్సికమ్	38
టమాట	5,030
మిరప	928
వంగ	350
బెండ	260
బీన్స్	614
కాకర	310
ఉల్లిగడ్డ	450
సొర	150
బీర	170



జాక్‌పాట్ కొట్టిన టమాట రైతు
ఇటీవల టమాటకు భారీ డిమాండ్ ఏర్పడింది. కర్ణాటక, చెన్నై, ఉత్తర భారతదేశంలోని కొన్ని నగరాల్లో టమాట ఉత్పత్తి తగ్గడం ఇక్కడి రైతులకు కలిసివచ్చింది. అక్కడి వ్యాపారుల రాక పెరిగింది. గతంలో నష్టాలు రావడం.. తెగుళ్ల బెడదతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గడం కూడా టమాట రైతుకు అనుకూలించింది. నాలుగు నెలల నుంచి కిలో రూ.60కిపైగా పలుకుతోంది. నెలన్నర నుంచి కిలో రూ.100పై మాటే. టమాట విత్తేందుకు ఆసక్తి చూపుతున్నారు. పలమనేరు, గంగవరం, కుప్పం, నగరి, చిత్తూరు, పుంగనూరు, సోమల, సదుం, చంద్రగిరి మండలాల్లో టమాట సాగుచేస్తున్నారు. ఇటీవల కిలో చికెన్ రూ.200 పలకగా.. అదే స్థాయిలో టమాట ధర పలకడం గమనార్హం.



కూరగాయల తోటతో లాభాలు
"నాకు మూడెకరాల పొలం ఉంది. గత ఏడాది వరి, వేరుశనగ సాగుచేశా. ఖర్చు ఎక్కువ.. దిగుబడి తక్కువ. ఇప్పుడు ఆ మూడెకరాల్లో ఎకరం బెండ, ఎకరం గోరుచిక్కుడు, మరో ఎకరం పొలంలో బీర సాగుచుశా. రోజూ 400 కిలోల కూరగాయలు దిగుబడి వస్తున్నాయి. కిలో బెండ రూ.50 చొప్పున విక్రయిస్తున్నాను. బెండలోనే రోజూ రూ.20 వేలు చేతికొస్తోంది.
– మునిరత్నం నాయుడు, పుత్తూరు మండలం, కోనప్పగుంట గ్రామం



వంగకు వందనం
ఊర్లో నాలుగెకరాల పొలం ఉంది. అందులో వరి సాగుచేస్తున్నాను. పక్కనే ఉన్న తిప్పవరప్పాడులో రెండెకరాలు కౌలుకు తీసుకున్నాను. ఒకటిన్నర ఎకరంలో వంగ సాగు ఆరంభించాను. రూ.2 లక్షలకుపైగా పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం రోజూ 700 నుంచి 800 కిలోల దిగుబడి వస్తోంది. కిలో రూ.60 నుంచి రూ.70కి విక్రయిస్తున్నాను. చేతి నిండా డబ్బులు చూస్తున్నాను.
– నీలకంఠయ్య, గూడూరు రూరల్ మండలం, చంబడిపాళెం




సాగువిస్తీర్ణం పెరుగుతోంది
ప్రస్తుతం రైతులు ఎక్కువగా ఉద్యాన పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. పండించిన పంటను రైతులే విక్రయించేందుకు ప్రోత్సహిస్తున్నాం. షెడ్లు, దుకాణాలు, మిషనరీల కోసం 40 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలు అందిస్తున్నాం. రైతులకు అవసరమైన మొక్కలు కూడా అందిస్తున్నాం.
– దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

పలకరిస్తూ.. భరోసా ఇస్తూ

రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వార్డుబాట తొలిరోజు పుంగనూరులో గురువారం ప్రజల ఆత్మీయ స్వాగతాల నడుమ ఉత్సాహంగా సాగింది. హనుమంతరాయుడిన్నెలో కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి ఒక్కరికీ ఆప్యాయంగా అభివాదం చేస్తూ.. పలకరిస్తూ ..వినతులు స్వీకరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ.. భరోసా ఇచ్చారు. హనుమంతరాయునిదిన్నె, రామ్‌నగర్ కాలనీ, డిగ్రీ కళాశాల, రామసముద్రం రోడ్డు, బీడీ కాలనీ, ప్రభుత్వాస్పత్రి రోడ్డు, కట్టకిందపాళ్యెం ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు వార్డుబాట నిర్వహించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందించి పథకాల ద్వారా అందుకున్న లబ్ధిని లబ్ధిదారులతోనే మంత్రి చదివించారు.

- పుంగనూరులో ఉత్సాహంగా ప్రారంభమైన వార్డుబాట
- అడుగడుగునా మంత్రి పెద్దిరెడ్డికి ఆత్మీయ స్వాగతం
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- సమస్యలపై తక్షణ ఆదేశాలు

పుంగనూరు: మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వార్డు పర్యటనకు జనం బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. మహిళలు మంగళ హారతులతో నీరాజనాలు పలికారు. మేళతాళాలతో, బాణసంచాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. మంత్రి పర్యటన ఈసారి కొత్తపంథాలో సాగింది. వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌ను వెంట పెట్టుకుని పర్యటన సాగించారు. ప్రజలు తమకు ఈ పథకం అందలేదని చెప్పిన వెంటనే, వలంటీర్ల ద్వారా మంజూరు ఉత్తర్వులు చూపిస్తూ వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మంజూరు చేసిన పథకాలు చూడండి... మీకు అందింది కదా ...అంటు మంత్రి లబ్ధిదారులను చదవమని చెప్పడంతో మహిళలు సంతృప్తి చెందారు. ఎన్‌ఎస్‌పేటలో కాలువలు ఏర్పాటు చేయాలని కోరడంతో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కాలువ పనులకు తక్షణం రూ.40 లక్షలు మంజూరు చేయించారు. వినతులను స్వీకరిస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసి పరిష్కరించడంతో వార్డుబాట ప్రజల్లో నూతనోత్తేజాన్ని నింపింది. ఈ పర్యటనలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, ఎంఆర్‌సీరెడ్డి, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ పాల్గొన్నారు.



లబ్ధిదారుతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఆర్‌వో ప్లాంటు ప్రారంభం ....
పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగుల కోసం రూ.3 లక్షలతో నిర్మించిన ఆర్‌వో ప్లాంటును చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలిసి మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు.రోగులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆస్పత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ పాల్గొన్నారు. అలాగే సుమారు రూ.1.20 కోట్లతో చేపట్టనున్న కాలువలు, రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు.

కారు నడిపిన మాజీ ఎమ్మెల్యే ...
పుంగనూరు వార్డుబాటలో పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కారును పుంగనూరు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నడిపారు. ఉదయం నుంచి మంత్రి పర్యటనలో శ్రీధర్‌రెడ్డి పాల్గొని ఆయన కారును నడపడంతో రాజకీయ సమీకరణాలపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.

ఆలయానికి చేయూత...
పట్టణంలోని ఎన్‌ఎస్‌పేటలో నిర్మిస్తున్న శ్రీఏకశిల ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి మంత్రి పెద్దిరెడ్డి చేయూతనిస్తామని తెలిపారు.

మీరు చదవండి..మేం చదివిస్తాం!



మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

- అట్టహాసంగా జగనన్న విదేశీ విద్యాదీవెన
- జిల్లాలో 15 మందికి రూ. 2.31కోట్ల జమ

తిరుపతి అర్బన్: 'తలరాత మార్చేది చదువు ఒక్కటే. ప్రతి ఇంట్లో గొప్పగొప్ప ఇంజినీర్లు.. డాక్టర్లు రావాలి. అందుకు ఎంత ఖర్చైనా ఫర్లేదు. మీరు చదవండి..మేం చదివిస్తాం' అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభల్లో చెబుతుంటారని.. ఆ మాటలు నిజం చేస్తూ విద్యకు పెద్దపీట వేశారని' కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. జగనన్న విదేశీ విద్యాదీవెన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ తాడేపల్లి నుంచి గురువారం ప్రారంభించగా.. అదే సమయంలో తిరుపతి కలెక్టరేట్ నుంచి లబ్ధిదారులతోపాటు వారి తల్లిదండ్రులు, అధికారులు ఆ కార్యక్రమాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ లబ్ధిదారులకు రూ.2.31 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి 357 మంది విద్యార్థులు ఎంపికవగా.. వారి ఖాతాల్లోకి రూ.45.53 కోట్లను జమచేశారని చెప్పారు. జిల్లాలో తొలి దశలో 15 మంది విద్యార్థులకు రూ.2.31కోట్లు జమచేసినట్టు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యాకోర్సులు అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించే దిశలో జగనన్న విదేశీ విద్యాదీవెన అమలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా సాంఘిక సంక్షేమ,సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

"నాకు రూ.53 లక్షల మంజూరు



నా పేరు దర్శిత చౌదరి. మాది తిరుపతి. నేను అమెరికాలోని న్యూయార్క్ యూనివర్సిటీలో మాస్టర్ సీట్ సంపాదించాను. జగనన్న విదేశీ విద్యా దీవెన గురించి తెలిసి...దరఖాస్తు చేసుకున్నా. ట్యూషన్ ఫీజు కింద రూ.53 లక్షలు మంజూరు చేశారు. జగనన్నకు ధన్యవాదాలు

వెళ్లలేననుకున్నా



నా పేరు జవహర్ రెడ్డి. మాది తిరుపతి. నేను ఎమ్మెస్సీ ఇన్ ఫైనాన్స్ టెక్నాలజీ అండ్ పాలసీ చదవడానికి యూకే వెళ్లాలనుకున్నాను. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఎంపిక కావడంతో నాకు రూ.38 లక్షలు మంజూరయ్యాయి.

నేడు ఉద్యోగ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఉప ఉపాధి కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో ఏజీటీఆర్ఎస్ ఐడార్ట్ సంస్థలో సీనియర్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఉద్యోగానికి ఏదేని డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో విద్యార్హత 18 నుంచి 30 ఏళ్లలోపున్న పురుషులు అర్హులని తెలిపారు. అపోలో ఫార్మసీలో రీటైల్ ట్రైనీ, అసోసియేట్/ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, ఎంఫార్మ్, బీఫార్మ్, డీఫార్మ్ విద్యార్హత, అలాగే కార్బన్ మొబైల్స్‌లో మొబైల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు పది, ఆపై విద్యార్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు.



దివ్యాంగులకు అండగా జగనన్న ప్రభుత్వం

శ్రీకాళహస్తి: దివ్యాంగులకు జగనన్న ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తూ.. అండగా నిలుస్తోందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విర్కో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు, కృత్రిమ కాళ్లు, చేతులు, చెవిటి మిషన్లు, హ్యాండ్ స్టిక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమశాఖ ద్వారా బాధితులకు చేయుతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టి వారిలో ఆత్మస్థైర నింపుతోందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులు మాట్లాడుతూ తమ జీవితంలో ఇలాంటి సహాయం ఎవ్వరూ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విర్కో ఫౌండేషన్ ద్వారా తమకు చేయూతనందించినందుకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విర్కో ఫౌండేషన్ సీఈవో ప్రవీణ, గురదేవ చారిటబుల్ ట్రస్టు జగదీష్‌ని టీటీడీ చైర్మన్ ఘనంగా సన్మానించారు. బియ్యపు పవిత్రారెడ్డి, లోకేష్‌యాదవ్, రత్నంరెడ్డి, చిట్టివేలు జయగోపాల్, పాలమంగళం రవి, యుగంధర్‌రెడ్డి, కొల్లూరు హరినాయుడు, సుమతి, రుషేంద్రమణి, దీపిక, జయశ్రీ, పసల కృష్ణయ్య పాల్గొన్నారు.



దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,268 మంది స్వామివారిని దర్శించుకోగా.. 26,817 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటరమణ


డాక్టర్ వెంకటరమణ అధ్యక్షుడు


మనోజ్‌కుమార్ కార్యదర్శి

తిరుపతి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కే.వెంకటరమణ (జెడ్పీహెచ్‌ఎస్, ఆర్.మల్లవరం) ఎన్నికయ్యారు. తిరుపతిలోని టీపీపీఎం హైస్కూల్లో గురువారం జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఇందులో భాగంగా కార్యదర్శిగా మనోజ్‌కుమార్ (జెడ్పీహెచ్‌ఎస్-గర్ల్స్, నాయుడుపేట), కోశాధికారిగా ఎస్.రవీందర్‌రాజు (జెడ్పీహెచ్‌ఎస్, దుర్గసముద్రం) ఎన్నికయ్యారు. అలాగే గౌరవాధ్యక్షులుగా చెంగల్‌రాజు (డైట్ లెక్చరర్), రాష్ట్ర కౌన్సిలర్లుగా బీ.మునిరత్నం, జీ.కృష్ణయ్య, సుధాకర్, మహిళా ప్రతినిధులుగా జీవీ.విష్ణువర్ధని, పీ.సునీత గౌడ్ ఎన్నికయ్యారు.

వెంటాడిన మృత్యువు


ప్రమాద స్థలం నుంచి సెగ్మెంట్‌ను మరో ప్రదేశానికి తరలిస్తున్న అధికారులు


మృతదేహాలను మూటగడుతున్న వైద్య సిబ్బంది

- శ్రీనివాస సేతు పనుల చివరి అంకంలో అపశ్రుతి
- మరో మూడు సెగ్మెంట్లు ఏర్పాటుతో ఫ్లైఓవర్ పూర్తి
- 5వ తేదీకల్లా పనులు పూర్తిచేసే క్రమంలో ప్రమాదం
- అనాథలుగా మృతులు

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ నిర్మాణ పనుల చివరి అంకంలో అపశ్రుతి చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. ఆఫ్కాన్ సంస్థ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కోసం వివిధ రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించింది. నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో అనుకోని ప్రమాదం చోటుచేసుకుంది. సెగ్మెంట్లను ఏర్పాటు చేసే క్రమంలో భారీ క్రేన్ ఐరన్ రోప్ తెగిపోవడంతో 70 టన్నుల బరువు గల సెగ్మెంట్ ఆరు అడుగుల ఎత్తు నుంచి పడిపోయింది. ఈ ఘటనలో వెస్ట్‌బెంగాల్‌కు చెందిన అవిజిత్ (21), బిహార్ రాష్ట్రానికి చెందిన బొద్దు మండల్ (41) అక్కడికక్కడే మృతిచెందారు. 2019 నుంచి పనులు ప్రారంభమవ్వగా శ్రీనివాస సేతు సమీపంలో కొన్ని సెగ్మెంట్లు పక్కకు ఒరిగిపోయాయి. తర్వాత జరిగిన ప్రమాదాల్లో ఇదే పెద్దది.

మూడు సెగ్మెంట్లతో పనులు పూర్తి

టీటీడీ ప్రధాన భాగస్వామ్యంతో శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. మొత్తం రూ.650.50 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తిరుచానూరు మార్కెట్ యార్డు నుంచి కపిలతీర్థం నంది కూడలి వరకు 6.4 కిలో మీటర్ల పొడవుతో శ్రీనివాస సేతును నిర్మిస్తున్నారు. మొత్తం 171 పిల్లర్లు, పిల్లర్ల మధ్య ఏర్పాటు చేసే సెగ్మెంట్లు మొత్తం 2,558తో పనులు పూర్తవుతాయి. ఇప్పటి వరకు 2,555 సెగ్మెంట్లను పిల్లర్లపై ఏర్పాటు చేశారు. చివరి మరో మూడు సెగ్మెంట్లు లిఫ్ట్ చేసేక్రమంలో(2,556వ సెగ్మెంట్) ఈ ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి కల్లా సెగ్మెంట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కానున్న నేపథ్యంలో చోటు చేసుకున్న ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది.

7న ఫిట్‌నెస్ సర్టిఫికెట్

500 టన్నుల సామర్థ్యాన్ని అవలీలగా ఎత్తగలిగే భారీ క్రేన్ కేవలం 70 టన్నుల సిమెంట్ సెగ్మెంట్ ఎత్తే క్రమంలో ఐరన్ రోప్ తెగిపోయింది. ఈ భారీ క్రేన్ ఫిట్ నెస్ సర్టిఫికెట్‌ను ఈ నెల 7వ తేదీన పొందారు. హైదరాబాద్‌లోని తుల్జా భవాని ఇంజినీర్స్‌కు చెందిన ఈ భారీ క్రేన్ 2012 మోడల్‌కు చెందినది. ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీస్ రూయిస్ కాంపిటెంట్ పర్సన్ నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు ఫిట్ ఫర్ వర్కింగ్ కండీషన్ సర్టిఫికెట్‌ను పొందారు. అయితే రోప్ అరిగిపోవడం, గ్రీస్ తేమ తగ్గి జిగురు ఆరిపోవడంతోనే క్రేన్‌కు ఉపయోగించే ఐరన్ రోప్ తెగిపోవడానికి కారణంగా భావిస్తున్నారు. అది కూడా పటిష్టంగానే ఉందని, దురదృష్టమే ప్రధాన కారణమని మరికొందరూ పేర్కొంటున్నారు.

నా అనేవారు లేరు

పొట్టకూటికోసం వచ్చిన కూలీలు ఊరుకాని ఊరొచ్చి మృత్యువాత పడ్డారు. మృతుల కుటుంబ సభ్యులు దరిదాపుల్లో లేకపోవడంతో అనాథశవాలుగా మిగిలిపోయాయి. తోటి కూలీలు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. మృతదేహాలను చూస్తూ చలించిపోయారు. మృత దేహాలను తిరుపతి రుయా ఆస్పత్రి మార్చురీలో ఉంచారు.


సెగ్మెంట్‌ను అమర్చే క్రమంలో తెగిపడిన క్రేన్ తీగలు


ప్రమాదంలో నేలకొరిగిన సెగ్మెంట్

ఆదుకుంటాం



తిరుపతిలో జరుగుతున్న శ్రీనివాససేతు పనుల్లో అపశ్రుతి చోటుచేసుకోవడం చాలా బాధాకరం. ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు మృతి చెందడం మనసును కలచివేసింది. మృతుల కుటుంబాలకు పూర్తిసహాయ సహకారాలు అందిస్తాం. – వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ చైర్మన్

ప్రమాదం.. బాధాకరం



శ్రీనివాస సేతు నిర్మాణ పనుల్లో ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరం. ఇద్దరు కార్మికులు మృతి చెందడం దిగ్భ్రాంతిని కలిగించింది. వారి కుటుంబానికి సంతాపం తెలియజేయడం తోపాటు అండగా నిలబడతాం. ప్రమాదం వెనుక మానవ తప్పిదం ఏమాత్రం లేదు. మెకానిజం లోపం వల్లే చోటు చేసుకుంది. అఫ్కాన్ సంస్థ అన్ని జాగ్రత్తలు తీసుకుంది. పనులు పూర్తవుతున్న క్రమంలో అపశ్రుతి చోటు చేసుకోవడం బాధాకరం. 500 టన్నులను ఎత్తగలిగే ఈ భారీ క్రేన్ కేవలం 70 టన్నుల సామర్థ్యం కలిగిన సెగ్మెంట్‌ను పైకి ఎత్తే క్రమంలో రోప్ తెగిపోవడం దురదృష్టకరం.
– భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

మృతుల కుటుంబాలకు అన్నివిధాలా న్యాయం



శ్రీనివాస సేతు నిర్మాణ పనులు చివరి అంకంలో ఉన్నాయి. ఇందులో మానవ తప్పిదం లేదు. మృతుల కుంటుంబాలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తాం. నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ నుంచి, కేంద్ర ప్రభుత్వ బీమాతో పాటు పీఎఫ్, స్మార్ట్ సిటీ నుంచి కూడా ఆర్థిక సాయాన్ని అందజేస్తాం. మృతదేహాలను స్వగ్రామం పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.
– డీ.హరిత, మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి స్మార్ట్ సిటీ


తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,600
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,532
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,500
రిటైల్ వెండి గ్రాము	రూ.79.50

తిరుపతి బస్ టెర్మినల్‌ను అభివృద్ధి చేయండి


కేంద్ర మంత్రితో ఎంపీ గురుమూర్తి భేటీ

తిరుపతి మంగళం: అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో తిరుపతి బస్ టెర్మినల్, ఇంటర్-మోడల్ స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ గురుమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ కార్యాలయంలో ఆ శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసి విన్నవించారు. తిరుపతి బస్ టెర్మినల్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ఇంటర్-మోడల్ స్టేషన్ అభివృద్ధి కోసం నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే ఉన్న నాలుగు లేన్ల తిరుపతి బైపాస్‌ను కి.మీ 274.800 నుంచి కిమీ 294.00 వరకు 19.2 కి.మీ అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. ఈ రహదారి విస్తరణ పనులను 'పీడీ చెన్నై ఏ హెచ్ ఏఐ' నుంచి 'పీడీ తిరుపతి ఏ హెచ్‌ఏఐ'కి మారుస్తూ మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. తడ – శ్రీకాళహస్తి, ఉతుకోట – సత్యవేడు – తడ, గూడూరు – రాజంపేట ఈ మూడు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించే అంశంపైన మరో భేటీలో చర్చించనున్నట్టు ఎంపీ వెల్లడించారు.

తిరుపతిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్-ఎంఈ) స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)ను ఏర్పాటు చేయాలని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలశాఖ సహాయ మంత్రి భానుప్రతాప్‌సింగ్ వర్మను ఎంపీ గురుమూర్తి కోరారు. ఢిల్లీలో ఆయన కేంద్రమంత్రిని కలిశారు. తిరుపతిలో మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్-ఎంఈ) స్పెషల్ ఎకనామిక్ జోన్ స్థాపనకు అన్ని విధాలా అర్హత ఉందని ఎంపీ వివరించారు.

పట్టపగలే చోరీ

తిరుపతి రూరల్: దొంగలు బరితెగించారు. తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీలో పట్టపగలే పగలే ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి దాదాపు రూ.7 లక్షల విలువైన బంగారం, వెండి, నగదును దోచుకెళ్లారు. రూరల్ ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పేరూరుకు చెందిన హేమలత ప్రైవేటు టీచర్. ఆమె భర్త ప్రకాష్ ఎలక్ట్రీషియన్‌గా ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. భార్యాభర్తలు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చిన ప్రకాష్, తలుపులు పగులగొట్టి ఉండడం, లోపల బీరువాను ధ్వంసం చేసి ఉండడంతో తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బీరువాలో ఉన్న 107 గ్రాముల బంగారం, వెండి, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లడంతో బాధితురాలు హేమలత కన్నీరు మున్నీరయ్యారు. హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు.

దేశం మెచ్చేలా తిరుపతి అభివృద్ధి

- తిరుపతి అభివృద్ధి విశాల రహదారులతోనే సాధ్యం
- తిరుపతికి త్వరలో డబుల్ డెక్కర్ బస్సులు
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి


కెనడీ నగర్‌లో ధ్రువపత్రాలు అందుకున్న లబ్ధిదారులతో మేయర్, డెప్యూటీ మేయర్లు

తిరుపతి మంగళం: తిరుపతిని దేశం మెచ్చేలా అభివృద్ధి చేస్తామని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి నగరంలోని 12, 13 డివిజన్ల పరిధిలోని కెనడినగర్, 6వ డివిజన్ కొత్తపల్లి, 45వ డివిజన్ శివజ్యోతినగర్లో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధికి నోచుకోకపోవడానికి ప్రధాన కారణం సరైన రహదారులు లేకపోవడమేనన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు తిరుపతికి మణిహారంలా మిగిలిపోతాయన్నారు. తిరుపతి నగరంలో ఎక్కడ చూసినా సీసీరోడ్లు, ఫ్రీలెఫ్ట్ రోడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు.

జగనన్న సురక్ష.. పేదలకు వరం

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన జగనన్న సురక్ష పథకం పేదల పాలిట వరమని భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఎంతోమంది పేదలకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా సర్టిఫికెట్లను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతానికి పైగా హామీలు అమలు చేశారన్నారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ ఇప్పటికే తిరుపతిలో జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ నిరంతరం పేదల పక్షన నిలబడుతూ వారి అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

తిరుపతికి త్వరలో డబుల్ డెక్కర్ బస్సులు

తిరుపతికి త్వరలో డబుల్ డెక్కర్ బస్సులను తీసుకురానున్నట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలో విశాలమైన రోడ్లు ఏర్పాటు చేశామని, దీంతో డబుల్ డెక్కర్ బస్సులు తిరిగేందుకు విశాలమైన రోడ్లు ఉన్నాయని చెప్పారు. తిరుపతిని ఐటీ హబ్‌గా మార్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కే.బాబు, కార్పొరేటర్లు కోటూరు ఆంజినేయులు, కేతం జానకి, అనీష్ రాయల్, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, అదనపు కమిషనర్ సునీత, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, జేసీఎస్ నాయకులు బాలిశెట్టి కిశోర్, ఉదయగిరి రమేష్, దొడ్డారెడ్డి మురళీ, నాయకులు తాళ్లూరి ప్రసాద్, రాపూరి ప్రసాద్, నల్లానీ బాబు, శ్యామల, రాజేశ్వరి పాల్గొన్నారు.

స్పష్టంగా ఓటర్ల సవరణ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: ఓటర్ల సవరణ తప్పుల్లేకుండా స్పష్టంగా తయారు చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన రాజకీయ పార్టీల నేతల తోపాటు వీఆర్వోలు, బీఎల్‌వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి వారం రాజకీ య పార్టీల నేతలతో సమీక్షిస్తున్నట్లు చెప్పారు. తమ పరిధిలో సమస్యలుంటే తెలియజేస్తే వాటిని సవరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మరోవైపు వీఆర్వోలు (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి) ఓటర్ల సవరణకు సంబంధించి ఎప్పటికప్పుడు బీఎల్‌వోల పనితీరుపై నిఘా పెట్టాలన్నారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని చెప్పారు. పది మందికి పైగా ఓటర్లు ఒకే ఇంటి నంబర్‌లో ఉంటే వాటిని పరిచూడాలన్నారు. జిల్లాలో 5,82,495 కుటుంబాలు ఉన్నాయని, ఇప్పటి వరకు 40 వేల గృహాలు మాత్రమే సర్వే చేశారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 8,376 క్లెయిమ్‌లు వచ్చాయని, వాటిని పరిశీలిస్తున్న వెల్లడించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన మేరకు ప్రత్యేకంగా తిరుపతి నియోజకవర్గంలో ఓటర్ల డోర్ నంబర్లు జీరో లేకుండా మునిసిపల్ కార్పొరేషన్ టాక్స్ ఇన్వాయిస్ మేరకు సరిదిద్దాలని డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డిని ఆదేశించారు. చంద్రగిరిలో బీఎల్‌ఓల పర్యటన సరిగాలేదన్నారు. గతంలో పోలింగ్ కేంద్రాల మార్పు పరిశీలించాలని కోరగా వీఆర్‌ఓ కనక నరసారెడ్డి పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. సమీక్షలో డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, ఈఆర్‌ఓలు కిరణ్‌కుమార్, రామారావు, చంద్రముని, కనక నరసారెడ్డి, నగరపాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌలీశ్వరరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బీజేపీ వరప్రసాద్, టీడీపీ మనోహరాచారి, సీపీఎం నాగరాజు, ఏఈఆర్‌ఓలు, తహసీల్దార్లు వెంకటరమణ, జరీనా, ఎన్నికల తహసీల్దార్ సురేష్, డీటీలు కిరణ్మయి, విజయభాస్కర్, జీవన్ పాల్గొన్నారు.

ఫుట్ బాల్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్పీజేఎన్ఎం పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన బాలికల విభాగం నుంచి 20 మంది, బాలుర విభాగం నుంచి మరో 20 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ.సుధాకర్, ఏ.రెడ్డెప్ప తెలిపారు.

రుయా అత్యవసర విభాగంలో మార్పులు


మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ రవి ప్రభు

తిరుపతి తుడా: రుయా అత్యవసర విభాగంలో సమూల మార్పులుకు శ్రీకారం చుట్టామని సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు తెలిపారు. అత్యవసర విభాగ ప్రక్షాళనపై గురువారం వివిధ శాఖధిపతులతో రుయా సూపరింటెండెంటు డాక్టర్ రవిప్రభు సమీక్ష నిర్వహించారు. ఆయా విభాగాల వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. ఆపై ఆయన రూపొందించిన ప్రణాళికలను అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర విభాగంలో జనరల్ మెడిసిన్ పీజీ వైద్యులను షిఫ్ట్ వారీగా నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. రోగి తీవ్రతను బట్టి వైద్య సేవలను విభజించి ఆ దిశగా అవసరం మేరకు మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. సీఎంఓలను ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి అటాచ్‌మెంట్ చేసి అత్యవసర వైద్యంలో భాగస్వాములు చేయనున్నట్లు చెప్పారు. ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలతోపాటు ఎమర్జెన్సీ విభాగ టెక్నీషియన్ల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు, ఆర్ఎంఓలు డాక్టర్ లక్ష్మానాయక్, డాక్టర్ ఈబీ దేవి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడలకు పటిష్ట ఏర్పాట్లు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఆడుదాం ఆంధ్రా క్రీడలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. క్రీడల నిర్వాహణకు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి 46 రోజుల పాటు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మేరా మట్టీ- మేరా దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 75 మొక్కలు నాటడం, విద్యార్థులకు వివిధ రంగాల్లో పోటీలు నిర్వహణ, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను గౌరవించడం, రక్తదానం, యోగా తదితర కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. జగనన్న సురక్ష క్యాంపులు శుక్రవారంతో పూర్తికానున్నాయని, జిల్లాలో 691 సచివాలయాల పరిధిలో 670లో క్యాంపులు నిర్వహించి 4 లక్షల 54 వేలకు పైగా కుటుంబాలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించామని వివరించారు. సమీక్షలో జిల్లా పంచాయతీ ఇంజినీర్ శంకర నారాయణ, డీఈఈఓ విశ్వనాథ్, డీఈఓ శేఖర్, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి సుధాకర్‌రెడ్డి, సెట్విన్ సీఈఓ మురళికృష్ణ, డీఎల్‌డీవో సుశీలాదేవి, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ శివకుమార్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కో-ఆర్డినేటర్ హనుమంతరావు పాల్గొన్నారు.